క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి జపయజ్ఞం



జపయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక దూసర్లపూడివారి వీధిలోని భోగిగణపతి పీఠంలో శ్రీవారి సేవాసమాజం ఆధ్వర్యంలో 70వ జపయజ్ఞ పారాయణ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం విష్ణు సహస్రపారాయణతో రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణస్వామిని ఆరాధించారు. పంచ భావనారాయణ క్షేత్రాల్లో మాహావిష్ణువుని దర్శించడం మాఘఫల వైశిష్ట్యం అన్నారు.

95.20 శాతం పింఛన్ల పంపిణీ

కాకినాడ: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను శనివారం సాయంత్రానికి 95.20 శాతానికి పూర్తి చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. ఉదయం 8 గంటలకే 50 శాతం పూర్తయ్యిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 29,568 మంది పింఛన్ లబ్ధిదారులకు గాను 28,127 మందికి సొమ్ములు పంపిణీ చేశామన్నారు.

కరపలో 93.4 శాతం..

కరప: మండల పరిధిలో శనివారం సాయంత్రానికి 93.4 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో పింఛన్ దారులు 11,316 మంది ఉండగా రూ.4,82,80,500 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,569 మందికి రూ.4,49,14,000 లు గ్రామసచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ ఇచ్చారన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న హరనాథరెడ్డి

బాలాజీచెరువు: రహదారి భద్రతపై డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులకు, హెవీ వెహికల్ డ్రైవర్లకు మోటారు రవాణాశాఖ వాహనాల అధికారి ఎం.హరనాథరెడ్డి అవగాహన కల్పించారు. శనివారం కోకనాడ హెవీ డ్రైవింగ్ స్కూల్, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులకు, ప్రమాదకరమైన వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో హరనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడకుండా ఎలా డ్రైవింగ్ చేయాలో మెళకువలు, తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల అధికారి ఎం.హరనాథరెడ్డి, రహదారి భద్రత మెడికల్ ఆఫీసర్ కుమారి ఏవీ పద్మావతి, ప్రిన్సిపాల్ ఎంఎస్ నవాజ్, కోకనాడ హెవీ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, దుర్గా హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉప్పాడలో కల్తీ డీజిల్ కలకలం

- సముద్రం మధ్యలో ఆగిపోయిన బోట్లు
- పెట్రోల్ బంకు వద్ద మత్స్యకారుల ఆందోళన



ఉప్పాడలోని పెట్రోలు బంకు వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి: ఉప్పాడ కోనపాపపేట బీచ్ రోడ్డులో అమీనాబాద్ సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో వేటకు వెళ్లిన మత్స్యకారులకు కల్తీ డీజిల్ విక్రయించడంపై శనివారం రాత్రి పెట్రోలు బంకు వద్ద ఆందోళన నిర్వహించారు. దీంతో హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లక్షల రూపాయలు విలువచేసే బోట్లకు కల్తీ డీజిల్ విక్రయించడం వలన సముద్రంలో ఏ ప్రమాదం జరిగినా బాధ్యులెవరంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు చిన్న, చిన్నబ్బాయిలు మాట్లాడుతూ తమకు సంబంధించిన రెండు బోట్లకు ఈ బంకు నుంచే డీజిల్‌ను కొనుగోలు చేడయం జరిగిందన్నారు. ఒక్కసారిగా సముద్రం మధ్యలో ఇంజిన్లు ఆగిపోయాయన్నారు. తమ ఇంజిన్లలో వేసిన డీజిల్‌లో నీరు కలిసిపోవడం వలన బోట్లు నిలిచిపోయాయన్నారు. తోటి మత్స్యకారుల బోట్ల సహాయంతో తీరానికి చేరినట్లు వారు తెలిపారు. ఇటువంటి కల్తీ డీజిల్‌ను విక్రయించి మత్స్యకారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న యజమానులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా పలుమార్లు ఇదే సంఘటనలు చేటు చేసుకున్నాయన్నారు. దీనిపై బంకు యజమానిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

పరేషన్ పాలన!

- ఏడు నెలల్లో ఆర్భాటం తప్ప చేసింది శూన్యం
- రేషన్ కార్డు, పింఛన్ల కోసం తప్పని తిప్పలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసినా పక్కన పెట్టిన కూటమి సర్కార్
- సచివాలయాల్లోనూ సమాచారం నిల్



రేషన్ కార్డులు

కాకినాడ సిటీ: టీడీపీ కూటమి సర్కార్ ఏడునెలల పాలన ఆర్భాటాలకే పరిమితమైందనే విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించడం, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామంటూ ప్రచార హంగామా తప్ప చేసిందేమీ లేదంటున్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ప్రజల వద్దకే పాలన సాగిస్తాం, వలంటీర్ల సేవలకు ఇస్తున్న గౌరవ వేతనం రూ.5 వేలు ఏ మాత్రం సరిపోదు, పది వేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు మభ్య పెట్టి సీఎం పీఠం ఎక్కిన చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఊరూవాడా వినిపిస్తున్నాయి. వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి సర్కార్ సచివాలయ వ్యవస్థ సేవలు ప్రజలకు అందకుండా నిర్వీర్యం చేస్తోందంటున్నారు. **సామాన్యులకు ప్రత్యేకించి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను పాలకులు పక్కన పెడుతున్నారన్నారు. పేర్లు మార్చి అయోమయానికి గురి చేస్తున్నారని పేదలు** విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల్లో ఏ సమాచారం లేకపోవడం ఇందుకు ప్రత్యేక సాక్ష్యం. ప్రత్యేకించి పింఛన్, రేషన్ కార్డుల మంజూరుకు పేదలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. సచివాలయాలు, చివరకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు అర్హులైన పేదలు. ఇప్పటికే కాకినాడ రూరల్, కరప, కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాలకు రేషన్ కార్డులు కావాలంటూ కొత్తగా పెళ్లైన దంపతులు, గతంలో వివిధ కారణాలతో రేషన్ కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాదాపు 3,869 దరఖాస్తులు అధికారుల కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా వివిధ పింఛన్ల కోసం గ్రీవెన్స్‌ల్లో 1,390 వరకు దరఖాస్తులు చేసుకున్నవారు ఉండగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,400 మంది, కాకినాడ అర్బన్ పరిధిలో 4వేలు మంది వరకు అర్హులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రేషన్ కార్డు లేక ఇబ్బంది



మాకు రేషన్ కార్డు లేదు. డిసెంబర్ 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రకటించడంతో రేషన్ కార్డు వస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూశాం. సచివాలయాలకు వెళ్తే రేషన్‌కార్డులకు సంబంధించి ఇంకా సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. గతంలో ఉండే రేషన్‌కార్డు కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని ఆపేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటేనే రేషన్ కార్డు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

– బొమ్మిడి రత్నం, సాంబమూర్తినగర్, కాకినాడ

అర్హులతో నిరసనలు



కొత్త రేషన్ కార్డులు, పింఛన్ మంజూరుకు అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పేదల సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జాప్యం తగదు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి. ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీపీఎం ఆధ్వర్యంలో అర్హులందరినీ ఒక్కటి చేసి ఉద్యమిస్తాం.

– పలివెల వీరబాబు, సీపీఎం నాయకుడు, కాకినాడ

నేటి నుంచి వైభవ వేంకటేశ్వరుని దివ్య కల్యాణ మహోత్సవం



కాకినాడ: కాకినాడ సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి బుధవారం వరకు స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ దివ్యక్షేత్రాన్ని స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా మాఘశుద్ధ చవితి నుంచి మాఘ శుద్ధ అష్టమి వరకు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. పంచరాత్ర ఆగమానుసారం ఆలయ ప్రతిష్టాపనా చార్యులు గోపినంబాల హయగ్రీవ శేషసూర్యనారాయణాచార్యులు, ఆలయ అర్చకులు పొందూరు సీతారామానుజాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

మధ్య తరగతికి దక్కేదెంత?

- కనీస వేతనం రూ.26 వేలు చేయాలి
- పన్ను మినహాయింపులు ప్రోత్సాహకరంగా లేవు
- కేంద్ర బడ్జెట్–2025పై సీపీఎం నిరసన



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్–2025పై సీపీఎం నగర కమిటీ నిరసన చేపట్టింది. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజ్‌కుమార్, నగర కన్వీనర్ పలివెల వీరబాబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దక్కేది ఎంతని ప్రశ్నించారు. విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు కేటాయింపులు పెంచాలన్నారు. రైతులు పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. బీమా రంగంలో 100 విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించారని ఎద్దేశా చేశారు. ఆదాయపు పన్ను విషయంలో ఇచ్చిన మినహాయింపులు మధ్య తరగతికి తగిన ప్రోత్సాహంగా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది పోస్టులు భర్తీ చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు 200 రోజులు కల్పించి, రోజు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. కేంద్ర బీజేపీ పాలనకు మూడోసారి మోడీ ప్రధాని కావడానికి కీలకంగా ఉన్న టీడీపీ, జనసేనలు రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన చట్టం హామీల అమలుకు తగిన విధంగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సంపన్నులకు వరాలు కురిపిస్తూ సామాన్యులపై భారాలు వేసే కేంద్ర బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, వేణు, మేడిశెట్టి వెంకటరమణ, రాణి, గంగాధర్, ప్రసాద్, సాగర్, సంజయ్, జైరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజకమైన బడ్జెట్



చిలుకూరి రామ్‌కుమార్

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకమైనదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రూ.12 లక్షల వరకూ ఆదాయంపై పన్ను మినహాయింపు మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు ఎంతో ఊరట ఇచ్చే అంశమన్నారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఉత్పత్తి, ఉపాధి కల్పనకు, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వృద్ధి రేటును మరింత పెంచుతాయన్నారు. ఎగుమతులకు సంబంధించిన ఉత్పత్తులు సుమారు 40 శాతం స్మాల్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ నుంచి వస్తున్నాయన్నారు. వీటికి అధిక ప్రాధాన్యం, రాయితీలు ఇవ్వడం వల్ల వృద్ధి రేటు పెరుగుతుందన్నారు. గ్రామీణ చిన్న పట్టణాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడం ద్వారా గ్రామీణ యువత ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వెళ్లే అవసరం ఉండదన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు



ఏబీసీని సందర్శించిన కమిషనర్ భావన

కమిషనర్ భావన

కాకినాడ: కుక్కల సంతతిని నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. శనివారం ఆమె జగన్నాథపురంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ)ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏబీసీ ఆపరేషన్ల తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్మాణంలో ఉన్న కెన్నల్స్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిన కుక్కలను నియంత్రించే క్రమంలో ఏబీసీ ఆపరేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. కాగా శనివారం ఆమె నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికీ చెత్త సేకరణను ఆరా తీశారు. రామకృష్ణారావుపేట ప్రాంతంలో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. ఏడీసీ కేటీ సుధాకర్, ఎంఎహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర రెడ్‌క్రాస్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

- చైర్మన్‌గా ఎన్నికైన రామారావుకు కలెక్టర్ షణ్మోహన్ అభినందన



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు

కాకినాడ సిటీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర నూతన చైర్మన్‌గా ఎన్నికైన కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సుదీర్ఘ కాలం ఇండియన్ రెడ్‌క్రాస్‌తో అనుబంధం కలిగి ఉండడంతో పాటు ఎనిమిదేళ్ల ఉమ్మడి తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌గా రామారావు విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయన రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీకి చైర్మన్ ఎన్నిక కావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీని రాష్ట్రంలో ఉత్తమంగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీని కూడా దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ ఆయనను ఘనంగా సత్కరించారు.

రామారావుకు అభినందనలు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ మాజీ అధ్యక్షులు వైడీ రామారావు రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షణీయమని క్లబ్ మాజీ కోశాధికారి సత్తి రవిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక సిద్ధార్థనగర్‌లోని రామారావు ఇంటి వద్ద ఆయనను సత్తి రవిరెడ్డి మిత్ర బృందం సత్కరించారు. రామారావు మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు సకాలంలో రక్తాన్ని అందించడానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రంగారావు, శ్రీనివాస్, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ–ఎ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్ష



గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక గాంధీనగర్ మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో 18 (ఏ) బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ పరీక్షకు 111 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరికి సుబేదార్ మేజర్ హేమంత్ కుమార్, హవాల్దార్ దిలీప్, సెకండ్ ఆఫీసర్ కె.అనిత, థర్డ్ ఆఫీసర్ జీవీవీ ప్రసాద్, సీటీ ఎం.రమ, భవానీ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ సర్పవరం, జెడ్పీహెచ్ఎస్ నవర, పీఆర్‌జీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి క్యాడెట్లు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌ల కార్యవర్గాల ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న వారియర్స్, హ్యుమానిటీ క్లబ్‌ల సభ్యులు

బోట్‌క్లబ్: సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో క్లబ్‌కు మంచి గుర్తింపు తీసుకొని రావాలని వాసవీ క్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ బోడా సాయి సూర్యప్రకాష్ అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో శనివారం వాసవీక్లబ్ కాకినాడ వారియర్స్, వాసవీక్లబ్ హ్యుమానిటీ కాకినాడ కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. వారియర్స్ అధ్యక్షులుగా గుల్లపూడి తేజ, సెక్రటరీగా పలుకూరి ధనరాజు గుప్తా, ట్రెజరర్ ములుకూరి శ్రీనివాస్, హ్యుమానిటీ కాకినాడ అధ్యక్షులుగా మన్యం దుర్గా సుభద్ర, సెక్రటరీగా నాళం సూర్యప్రభ, ట్రెజరర్‌గా మండవిల్లి మౌనిక, ఇతర సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త జి.బాబ్జీ, పెద్ది రత్నాజీ, వెలగ వెంకట నగేష్, కృష్ణమోహన్, పాబోలు పున్నయ్య సామా రమేష్ పాల్గొన్నారు.

డీఎస్ఏలో కిచెన్, ఓపెన్ స్టేజ్ ప్రారంభం



డీఎస్ఏలో నిర్మించిన వంటగది

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో రూ.5 లక్షలతో స్టేజ్ డయాస్ కిచెన్ రూమ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బాపిరాజు పేర్కొన్నారు. కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల జిల్లా క్రీడా మైదానంలో హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీటిని శనివారం ప్రారంభించారు. సంస్థ చైర్మన్ తలాటం హరీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగమణి కొండుకూరి ముఖ్య అతిథిగా కిచెన్ రూమ్ ను ప్రారంభించగా, కోటయ్య స్వీట్స్ అధినేత రామ్ కుమార్ మరో ముఖ్య అతిథిగా స్టేజ్ డయాస్‌ను ప్రారంభించారు. హరీష్ కొబ్బరి కాయ కొట్టి పూజ చేశారు. హరీష్ తన జన్మదినం సందర్భంగా స్టేజ్ డయాస్ కిచెన్ రూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. హరీష్ మాట్లాడుతూ క్రీడా మైదానంలో స్టేజ్ డయాస్ కిచెన్ రూమ్‌లు లేక క్రీడా సంఘాల నిర్వహకులు ఇబ్బంది పడుతున్నారని డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్ చెప్పడంతో వీటిని నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పంపన సాయి, హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ సభ్యులు పిడక శేషు, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధితునికి యంగ్‌మైండ్స్ ఆర్థికసాయం

కరప: స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బాధితుడు చిడీల నేరెళ్లకు యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ రూ.ఐదు వేలు ఆర్థిక సాయమందించింది. నేరెళ్లకు ఇటీవల అనారోగ్యం వల్ల జీజీహెచ్‌లో ఎడమకాలు మోకాలు వరకు తొలగించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అభ్యర్థన మేరకు యంగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ స్పందించి శనివారం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావుతో కలసి ఈ ఆర్థిక సాయం అందించారు.

భూముల మార్కెట్ విలువలపై గందరగోళం

కాకినాడ లీగల్: భూముల మార్కెట్ విలువలు శనివారం నుంచి పెరిగాయి. పెరిగిన మార్కెట్ విలువల ఆన్‌లైన్‌లో కొత్త భూముల ధరలు నమోదు చేసినప్పటికీ కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత భూముల ధరలు వస్తున్నాయి. అందులో భాగంగా కార్పొరేషన్లలో, మున్సిపాలిటీల్లో డోర్ నెంబర్ల ప్రకారం మార్కెట్ విలువలు ఉంటాయి. డోర్ నెంబర్ల ప్రకారం ఉన్న మార్కెట్ విలువలు కొత్తవి నమోదైనప్పటికీ కొన్ని ప్రాంతాలకు సంబంధించి పాత మార్కెట్ విలువలు రావడంతో శనివారం రిజిస్ట్రేషన్లు చేయలేదు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చిన క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడ్డారు. భూముల మార్కెట్ విలువలు పెరిగిన మొదటిరోజు బ్యాంక్ తనఖా రిజిస్ట్రేషన్లు, తనఖా విడుదల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

మనలోని చెడే భూతాలు.. ధైర్యమే దైవం

- ఆకట్టుకున్న భూతకాలం నాటకం
- ఉత్కంఠగా తిలకించిన నగర ప్రజలు



భూతకాలం నాటకంలోని ఒక సన్నివేశం

బోట్‌క్లబ్: హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ బృందం ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక దంటు కళాక్షేత్రంలో ప్రదర్శించిన భూతకాలం నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మనలోని అత్యాశ, కోరిక, చెడులే మన భూతాలని, మనలోని ధైర్యమే దైవమని చాటిచెబుతూ ప్రదర్శించిన నాటికలోని సన్నివేశాలు ఆద్యంతం ఆహూతులను ఆలోచింపజేశాయి. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ నాటకాన్ని నగర ప్రజలు ఉత్కంఠగా తిలకించారు. దీంతో దంటు కళాక్షేత్రం ప్రేక్షకులతో కిక్కిరిసిపోయింది. గోవాడ వెంకట్ దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ నాటకం రచయిత దివాకర్ బాబు. తొలుత కళాక్షేత్రం గౌరవ సలహాదారుగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన డీవీఎస్ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు జి.సర్వేశ్వరరావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షులు దంటు భాస్కర్రావు మాట్లాడుతూ శర్మ దంటూ కళాక్షేత్రానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. హార్మోనిస్ట్‌గా, దర్శకునిగా జి.సర్వేశ్వర్రావు కళామతల్లికి ఎంతగానో సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు వైఎస్ఎన్ మూర్తి, ఎం.ప్రభుదాసు, ముంజులూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మాండవ్యనారాయణుని పట్టించుకోరూ..

అన్నవరం ఈఓకు ట్రస్ట్‌బోర్డు సభ్యుల వినతి

సామర్లకోట: స్థానిక గోదావరి నదీతీరంలోని మాండవ్యనారాయణస్వామి ఆలయానికి రంగులు వేయించాలని ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు అన్నవరం దేవస్థాన ఈఓ విళ్ల సుబ్బారావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సాయంత్రం హరిబాబు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మాండవ్యనారాయణస్వామి ఆలయంలో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని, వీటికి సంబంధించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రంగులు వేయించాలని కోరినట్టు తెలిపారు. ఎంతో పవిత్రమైన విష్ణు ఆలయంగా మాండవ్యనారాయణ స్వామి ఆలయానికి పేరు ఉందన్నారు. అటువంటి ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మాండవ్యనారాయణస్వామిని దర్శించుకునేలా ప్రచారం జరగాలన్నారు.